## క్లుప్తంగా

### శ్రీవారికి చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

మార్కాపురం: పట్టణ సమీపంలోని గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి భక్తిశ్రద్ధలతో చక్రస్నానం చేయించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. రాత్రి ఉభయ దేవేరిలతో కలిపి స్వామి వారు అశ్వవాహనంపై నగరోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మూల విరాట్‌కు అభిషేకం, విష్వక్సేన పూజ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఆర్‌కేజీ నరసింహం, ఉటూకూరి రామకృష్ణ, ఉభయదాతలు నాదెళ్ల సుబ్రహ్మణ్యం, చంద్రమౌళి దంపతులు పాల్గొన్నారు.

### నేడు మంత్రి ఆదిమూలపు సురేష్ పర్యటన

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం వైపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు, త్రిపురాంతకం మండలాల్లో పర్యటిస్తారు. ఉదయం 8గంటలకు పెద్దారవీడు మండలంలోని రాజంపల్లికి సమీపంలోని గొడ్రాలి కొండ తిరుమలనాథ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను పరిశీలిస్తారు. 10.30 గంటలకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో పల్నాడు అర్బన్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు త్రిపురాంతకం మండలంలోని అన్నసముద్రం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారు. 2 గంటలకు మేడపి గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది.

### రేపు షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

పొదిలి రూరల్: ప్రకాశం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మధ్యాహ్నం షూటింగ్ బాల్ పురుషులు,మహిళల జట్లు ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రత్నకుమార్ తెలిపారు. అక్కడ ఎంపికైన క్రీడాకారులు కృష్ణా జిల్లా హనుమన్‌జంక్షన్‌లో ఈ నెల 10,11,12వ తేదీల్లో జరగబోవు 41వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. వివరాలకు ఆర్.చెన్నకేశవులు 63014 39754 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

బేస్తవారిపేట: రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని గిద్దలూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బాలాజీనాయక్ కోరారు. గురువారం రబీ సీజన్‌లో ఈ–క్రాప్ బుకింగ్ చేసిన పంటలను సలకలవీడు, నేకునాంబాద్, పిటికాయగుళ్ల, జేసీ అగ్రహారంలో ఆయన తనిఖీ చేశారు. ఈ–కేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాల్సిన రైతుల జాబితా ఆర్‌బీకేల్లో ఉందన్నారు. వ్యవసాయాధికారి జక్కం మెర్సీ పాల్గొన్నారు.

### హాస్టళ్లను పట్టించుకోని ఏఎస్‌డబ్ల్యూఓ

బేస్తవారిపేట: అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి స్థానికంగా నివాసం ఉండటం లేదని, హాస్టల్స్‌ను సక్రమంగా తనిఖీ చేయక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఆరోపించారు. గురువారం బేస్తవారిపేటలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. మంచి నీటి సరఫరా, ఆరేళ్లుగా అసంపూర్తిగా వదిలేసిన మరుగుదొడ్లతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, హాజరు శాతం తక్కువగా ఉందన్నారు.

### విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగేంద్ర

మార్కాపురం: గొట్టిపడియ గ్రామానికి చెందిన వాలంటీర్ కె. నాగేంద్రబాబు తన పరిధిలో ఉన్న పింఛన్ లబ్ధిదారు భూతపాటి కళావతికి విజయవాడ వెళ్లి గురువారం పింఛన్ అందజేశారు. పక్షవాతం కారణంగా కొన్ని రోజులుగా విజయవాడలోని సిరివెళ్ల నర్సింగ్ హోంలో కళావతి చికిత్స పొందుతోంది. వాలంటీర్‌ను సర్పంచ్ వి.వెంకటలక్ష్మి, నాయకులు చెన్నారెడ్డి అభినందించారు.

## సంక్షేమానికి చిరునామా

# జగనన్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- గడప గడపలో ఎమ్మెల్యే కేపీకి ఘన స్వాగతం



సన్మానం అందుకున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, కౌన్సిలర్లు

మార్కాపురం టౌన్: సంక్షేమానికి చిరునామా జగనన్న ప్రభుత్వమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 4వ సచివాలయం పరిధి 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్డులో పర్యటించి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. గడప గడపలో హారతులిచ్చి, పూలుచల్లి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ అర్హులకు నవరత్నాలు వస్తున్నాయన్నారు. 75 ఏళ్లలో రాష్ట్రంలో జరగని అభివృద్ధి గడిచిన నాలుగేళ్లలో జరిగిందన్నారు. గతంలో రికమెండేషన్‌లు ఉంటేనే పథకాలు వచ్చేవని, మన ప్రభుత్వంలో అర్హత ఉంటే పథాకాలు వస్తాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఫింఛన్ పెంచి ఇస్తున్నట్లు తెలిపారు. సచివాలయం వ్యవస్థతో ప్రజల ఇబ్బందులు తప్పాయన్నారు. ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరూ బాగుండాలనే లక్ష్యంతో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ రైతు భరోసా, ఆసరా, జగనన్న విద్యదీవెన, అమ్మ ఒడి తదితర పథకాలన్నీ అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ వివరించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్‌లు దొడ్డా భాగ్యలక్ష్మి, నాగిరెడ్డి, డాక్టర్ కనకదుర్గ, షెక్షావలి, హర్షిత బాబీ, నాగఅరుణ, వై.రంగలక్ష్మమ్మ, వనజాక్షి, సిరాజ్, రోజ్‌లీడియా, భాను, అమిరుల్లాఖాన్, సలీం, కొత్త కృష్ణ, షెక్షావలీ, ఉస్మాన్, మయూరి కాశిం, జి.చెన్నారెడ్డి, ఉత్తమ్‌కుమార్, డి.ప్రసాద్, కరీంబాషా, కరీముల్లా, కొలగట్ల శివారెడ్డి, ఎల్లకర రంగయ్య, డీఈ సుభానీ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.

## సీఎం చిత్రపటానికి టైలర్ల క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, టైలర్స్ అసోసియేషన్ నాయకులు

త్రిపురాంతకం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అండగా ఉన్నాయని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జగనన్న చేదోడు అందుకున్న టైలర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నవరత్నాలు పథకాలతో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## దొంగతనాల నిరోధానికి సహకరించాలి

తాళ్లూరు: దొంగతనాలను అరికట్టడంలో వ్యాపారులు తమ వంతు సహకారం అందించాలని దర్శి సీఐ జె.రామకోటయ్య కోరారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం మండలంలోని పలు గ్రామాల వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ వ్యాపారాల సముదాయాలు, రద్దీ ప్రాంతాలు, పెట్రోలు బంకులు, దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు తమ వంతు సహకారం అందించాలని, రోడ్లపై వినియోగదారులు వాహనాలు నిలపకుండా ముందస్తు సూచనలు ఇవ్వాలని చెప్పారు. ఆర్థిక మోసాలు అధికంగా జరుగుతన్నాయని, తగిన జాగ్రత్తలు తీసుకుని ఆర్థిక లావాదేవీలు జరుపుకోవాలని సీఐ సూచించారు. ఎస్ఐ ప్రేమ్‌కుమార్, ఏఎస్ఐ మోహనరావు పాల్గొన్నారు.

ముండ్లమూరు: పెట్రోల్ బంక్‌ల నిర్వాకులు, వ్యాపారులు తమ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రామకోటయ్య సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం వ్యాపార నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఎస్ఐ సంపత్‌కుమార్, వ్యాపారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లు, కూలీలతో మాట్లాడుతున్న ఎస్ఐ పులి రాజేష్

పెద్దారవీడు: వాహనచోదకులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై పులి రాజేష్ సూచించారు. మండలంలో దేవరాజుగట్టు గ్రామం పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, కూలీలకు గురువారం సాయంత్రం రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని తెలిపారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఆయనతో పాటు పోలీసులు, ఆటో డ్రైవర్లు, కూలీలు ఉన్నారు.

## కేపీఎల్–2 విజేత చాంప్ లెవన్స్



విజేతగా నిలిచిన చాంప్ లెవన్స్ జట్టు

కందుకూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కందుకూరు ప్రీమియర్ లీగ్–2 టీ20 క్రికెట్ పోటీల విజేతగా చాంప్ లెవన్స్ జట్టు విజేతగా నిలిచింది. పది రోజులుగా కేపీఎల్–2 పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. మొత్తం 26 జట్లు పోటీల్లో పాల్గొనగా చాంప్ లెవన్స్, సంతోష్‌నగర్ డైనమిక్స్ జట్లు ఫైనల్‌కు చేరాయి. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన చాంప్ లెవన్స్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 150 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన సంతోష్‌నగర్ జట్టు 100 పరుగులకే పరిమితమైంది. దీంతో చాంప్ లెవన్స్ జట్టు విజేతగా నిలిచి సురేష్‌రెడ్డి చికెన్ సెంటర్ అధినేత సురేష్‌రెడ్డి చేతుల మీదుగా టోర్నమెంట్ మొదటి బహుమతి రూ.50వేలు కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో నిలిచిన సంతోష్‌నగర్ జట్టుకు రూ.30 వేలు బహుమతిని కళ్యాణి శిల్క్స్ అధినేత వినోద్ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా చాంప్ లెవన్ జట్టుకు చెందిన జయసూర్య, బెస్టు బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులను సంతోష్‌నగర్ జట్టుకు చెందిన సల్మాన్ అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సీనియర్ క్రికెట్ ప్లేయర్ కొంగల నాగరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, డాక్టర్ నవీన్‌కుమార్, విఠల్ ట్రేడర్స్ అధినేత విఠల్‌లు బహుమతులు అందజేశారు.

## మెకానిక్‌కు ఆర్థిక సాయం



ఖాదర్‌కు నగదు అందజేస్తున్న మెకానిక్‌లు

కందుకూరు: ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన బైక్ మెకానిక్ కుటుంబాన్ని ఆదుకునేందుకు కందుకూరు బైక్ మెకానిక్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. స్థానిక ఆదిత్య ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో నగదు అందజేశారు. పట్టణానికి చెందిన మెకానిక్ ఖాదర్ గుండె సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం భారీగా నగదు అవసరం కావడంతో ముందుకు వచ్చిన తోటి మెకానిక్‌లు సంఘం తరుపున సాయం అందించారు. సంఘం రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా ఖాదర్‌కు రూ.3.70 లక్షల సాయం చేశారు. అలాగే అనారోగ్యంతో మరో ఇద్దరు మెకానిక్‌లకు రూ.10వేల చొప్పున సాయం అందజేశారు. సంఘం నాయకులు జిలాని, ఖుద్దీష్, రూబీ తదితరులు పాల్గొన్నారు.

### వరిలో రోగ నిరోధక శక్తిని పెంచాలి

తాళ్లూరు: వరిలో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు సుడోమోనాస్ వాడితే మొక్కల్లో అన్ని భాగాల్లో వ్యాపించి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరులో గురువారం పొలం బడి కార్యక్రమంలో భాగంగా వరి పంటలో వచ్చే పలు రకాల తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ నాయక్ పాల్గొన్నారు.

### వెలుగొండకు నిధులు కేటాయించాలి

తర్లుపాడు: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రానున్న బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించి ప్యాకేజీ అందజేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. త్వరగా ప్రాజెక్టును పూర్తి చేసి నీరు విడుదల చేయాలని నాయకులు కోరారు. రైతు సంఘ నాయకులు గంగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పాపిరెడ్డి, రైతులు రఘురామ్‌రెడ్డి, అంకమ్మ, చిన్న కోటమ్మ, నారాయణ పాల్గొన్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ముండ్లమూరు: ప్రభలు ఏర్పాటు చేసుకునే వారు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని వేములలో గురువారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కొండగురునాథ స్వామి తిరునాళ్లకు ఏర్పాటు చేస్తున్న ప్రభల నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రభల వద్ద ఏర్పాటు చేసుకునే పాట కచ్చేరిల వద్ద రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. సంయమనం పాటించి అనుమతి పొందిన ప్రకారం కార్యక్రమం నిర్వహించుకోవాలన్నారు. వేముల సమస్యాత్మక గ్రామం కావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో పర్యటించి ఇరువర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

### పశుపోషకులకు చాఫ్ కటర్ అందజేత



చాఫ్ కటర్ అందజేస్తున్న ఏడీ

గిద్దలూరు రూరల్: మండలంలోని మోడంపల్లె, కంచిపల్లె గ్రామాలకు చెందిన ఇద్దరు పశుపోషకులకు ప్రభుత్వం నుంచి వచ్చిన గడ్డి కత్తరించే యంత్రాలను గురువారం పశుసంవర్ధక శాఖ ఏడీ యోగానంద్, డాక్టర్ రంగస్వామిలు అందజేశారు. ఏడీ మాట్లాడుతూ ప్రభుత్వం చాఫ్ కటర్‌లను సబ్సిడీపై అందజేస్తోందన్నారు. యంత్రం అసలు ధర రూ.33.970 ఉండగా అందులో పశుపోషకుడు రూ.20,300 చెల్లిస్తే యంత్రం ఇస్తారని చెప్పారు.

### వైఎస్సార్ బీమా అందజేత



నగదు అందిస్తున్న సర్పంచి, ఎంపీటీసీలు

తాళ్లూరు: ఎస్టీ కాలనీలో గురువారం గుండెపోటుతో మృతి చెందిన గుర్నాధం పీటర్ పాల్ (37) భార్య మనోహరమ్మకు వైఎస్సార్ బీమాలో మట్టి ఖర్చుల కురూ.10 వేల నగదు సర్పంచి మేకల చార్లెస్ సర్జన్, ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్‌లు అందించారు. ఈఓఆర్డీ ప్రసన్నకుమార్, కార్యదర్శి చిరంజీవి, వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### రేషన్ షాపులపై అధికారుల తనిఖీలు

కురిచేడు: మండలంలోని కల్లూరు, పడమర కాశీపురం రేషన్ షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్.మల్లికార్జుననాయుడు, ఇన్‌చార్జి ఆర్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, వీఆర్వో కాశయ్యలు గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్లూరు రేషన్ షాపులో నిల్వలు సక్రమంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. పడమర కాశీపురం రేషన్ షాపు డీలర్ అందుబాటులో లేకపోవడంతో అధికారులు మరో తాళం వేసి నోటీసు అంటించారు. అధికారుల సమక్షంలో షాపు తాళం తీసి తనిఖీ చేయాల్సి ఉందన్నారు. అలా కాకుండా అధికారుల అనుమతులు లేకుండా తాళాలు తీస్తే డీలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జుననాయుడు హెచ్చరించారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం



అగ్నిప్రమాద బాధితులకు నగదు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గురువారం మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా పుల్లలచెరువు మండలం అయ్యగానిపల్లెకు చెందిన కాటిపల్లి మల్లమ్మకు మంత్రి ఆదిమూలపు సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు గుమ్మా యల్లేష్, వైస్ సర్పంచ్ దూదేకుల రసూల్ 15 వేల రూపాయల నగదు అందజేశారు.

## ఆంధ్ర కేసరికి ఘన నివాళి



ఆంధ్రకేసరికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాళ్లూరు: ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆంధ్రకేసరి చిత్రపటానికి, సీపీ బ్రౌన్ సేవా సంస్థ ఏర్పాటు చేసిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారి విగ్రహానికి ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచిలు మేకల చార్లెస్ సర్జన్, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈఓ జి.సుబ్బయ్య, ఏపీఓ మురళి, కార్యాలయ పర్యవేక్షకుడు వజ్జా శ్రీనివాసరావు, ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్, ఈసీ ప్రసాద్, కార్యదర్శి చిరంజీవి, వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి

కంభం: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కానికి కృషి చేస్తానని తూర్పు రాయలసీమ నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఉపాధ్యాయులతో మమేకమై తిరుగుతున్నానని, ఉపాధ్యాయులు పలు సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని పరిష్కరించడంతో పాటు కాంట్రాక్ట్, ఎయిడెడ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర బాధ్యుడు కేశవరపు జాలిరెడ్డి, జిల్లా బాధ్యుడు వెంకటేశ్వరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ కనకదుర్గ

మార్కాపురం టౌన్: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవాలందించాలని 4వ వార్డు కౌన్సిలర్, శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు డాక్టర్ సీహెచ్ కనకదుర్గ అన్నారు. గురువారం ఆమె వార్డు వలంటీర్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. సమయపాలన పాటిస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ప్రజా సమస్యలతో పాటు వార్డు సమస్యలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. వలంటీర్లు ఫింఛన్ పంపిణీని పూర్తి చేయాలన్నారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే గుర్తించి దరఖాస్తు చేయించాలన్నారు. సిబ్బంది వెంకటేశ్వర్లు, ఆవులయ్య, కిరణ్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

తాళ్లూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో గురువారం ప్రపంచ చిత్తడి నెలల దినోత్సవం సందర్భంగా రైతులకు మొక్కల పంపిణీ చేశారు. పర్యావరణం పచ్చగా ఉంటే భూతాపం తగ్గి వర్షాలు సకాలంలో కురుస్తాయని వక్తలు అన్నారు. సర్పంచి మేకల చార్లెస్ సర్జన్, ఏపీఓ మురళి, ఎంఈఓ సుబ్బయ్య, ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్ ఈసీ ప్రసాద్ పాల్గొన్నారు.

## త్వరితగతిన ఫిర్యాదులు పరిష్కరిస్తాం

- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మాజనార్దన్‌రెడ్డి



విద్యుత్ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న పద్మాజనార్దన్‌రెడ్డి

దర్శి: విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) జే పద్మాజనార్దన్‌రెడ్డి అన్నారు. దర్శి పట్టణంలోని తాలూకా క్లబ్ సమావేశ మందిరంలో విద్యుత్ వినియోగదారులతో గురువారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మాజనార్దన్‌రెడ్డి.. స్వయంగా అర్జీలు తీసుకుని వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కార మార్గం చూపారు. మొత్తం 20 అర్జీలు రాగా అన్నింటినీ అక్కడికక్కడే పరిష్కరించారు. ముండ్లమూరు మండలంలో కొత్త సబ్‌స్టేషన్ కోసం అర్జీ రాగా.. వీలైనంత త్వరగా మంజూరు చేస్తామన్నారు. అనంతరం సబ్‌స్టేషన్‌ను పరిశీలించి ఆక్రమణకు గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సబ్‌స్టేషన్ స్థలానికి ఫెన్సింగ్, డీఈ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం రూరల్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసుకునేందుకు సర్వర్ నిలిపివేసి ఉన్నారని ఆయన దృష్టికి తీసుకురాగా, త్వరలో సర్వర్ వదులుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ కేజీవీ సత్యనారాయణ, ఈఈలు ఎస్ఏ కరీం, ఏ సత్యనారాయణ, ఎస్ఏఓ కే సుబ్బారావు, డీఈఈ కే పిచ్చయ్య, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.